

# పడి లేచిన కడలి తరంగం...

- సింగరాజు రమాదేవి

**మొక్కలు బాగా పెరగాలంటే, వాటికి గాలీ, నీరూ, ఎండా అన్నీ అవసరమే! ఎరువులు మాత్రమే వేస్తే సరిపోదు! పిల్లలూ అంతే!!**

❋ ❋ ❋

"అబ్బా ప్లీజ్ అన్నయ్యా, ఛానెల్ మార్చకన్నయ్యా, ప్లీజ్! ప్లీజ్! నా ఫేవరెట్ హీరో రవితేజ సినిమా 'ఇడియట్' వస్తోంది ప్లీజ్! చూడనీ!" అభి చేతుల్లోంచి రిమోట్ లాక్కుంటూ అంటున్నాడు దీపూ.

'ఒరేయ్! ఒబామా కైరోలో ఇస్తున్న స్పీచ్ లైవ్ చూపిస్తున్నార్రా! అది చూద్దాం! స్టుపిడ్ లాగా ఈ 'ఇడియట్' సినిమా ఎన్నిసార్లు చూస్తావు? అభి అంటున్నాడు.

'ఒబామానా? ఎక్కడో అమెరికా ప్రైమ్‌మినిస్టర్ సంగతి మనకెందుకన్నయ్యా? ఈ సినిమా చాలా నవ్వుగా ఉంటుంది తెల్సా?' దీపూ సమాధానం.

'రేయ్! ఒబామా అమెరికాకి ప్రైమ్ మినిస్టర్ కాదురు ప్రెసిడెంట్!'

'అదేలే అన్నయ్యా ఏదో ఒకటి...!'

'సరే! సినిమానే చూడాలంటే, 'గ్రహణం' వస్తోంది పెట్టు. అవార్డ్ విన్నింగ్ ఫిల్మ్ అది. చలం స్టోరీ! అదైనా చూద్దాం!'

"చలం ఎవరు అన్నయ్యా?" టి.వి. స్క్రీన్ మీంచి తల తిప్పకుండానే అడిగాడు దీపూ.

"ఓరి నాయనో... ఇంక నిన్ను వదిలేస్తున్నానురా! నీకు ఇడియటే కరెక్ట్..."

అభీ ఇంకా ఏదో అనబోతుంటే...

"అభీ! వాడినెందుకురా ఏడిపిస్తావు? వాడికిష్టమైన ప్రోగ్రామ్ ఏదో వాడిని చూసుకోనీ! మళ్ళీ హాస్టల్‌కి వెళితే, వాడికి ఆ ఛాన్స్ ఉండదు కదా..." వంటింట్లో వేడివేడిగా గారెలు వేస్తూ, వాళ్ళ సంభాషణంతా వింటున్న నేను నవ్వుతూ వారించాను.

దీపూ మా చెల్లెలి కొడుకు. బిటెక్ చదువుతున్నాడు. శెలవల్లో మా ఇంటికి వచ్చాడు.

'కాదు మమ్మీ, వీడు బిటెక్ సెకండియర్ చదువుతున్నాడు. వాడికి ఒబామా ఎవరో తెలీదు! చలం అంటే ఎవరు? అంటాడు. నిజంగా వాడొక స్పెసిమెన్!' వంటింట్లోకి ప్లేట్ పట్టుకొచ్చి గారెలు వేయించుకుంటూ అన్నాడు అభి.

"పోన్లేరా, చిన్నవాడు, ఇదిగో, వాడి ప్లేట్‌లో కూడా ఈ రెండు వెయ్యి," వెళ్తున్న అభికి ఇంక రెండు గారెలు వేసి పంపాను.

అభి ఇప్పుడు ఎమ్.ఎ. రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఆరడుగుల పొడుగుతో, పొడుగుకు తగ్గ లావుతో, చురుకైన కళ్ళు, చెదరని చిరునవ్వుతో ఉండే అభిని చూస్తే, నాలుగేళ్ళ క్రితం ఉన్న అభి వీడేనా అన్న సందేహం కలగక మానదు.

మా జీవితాల్ని, ఆలోచనల్ని అమాంతం మార్చేసిన సంఘటన. ఇప్పటికీ తలుచుకుంటే ఒళ్ళు జలదరిస్తుంది! అప్రయత్నంగా నా మనసు, నాలుగేళ్ళ వెనక్కి మళ్ళింది.

❋ ❋ ❋

టైమ్ రాత్రి పదవుతోంది. అప్పుడే భోజనాలు ముగించి నేను వంటింట్లో సర్దుకుంటున్నా, రాఘవ టి.వి. ముందు కూర్చుని ఉన్నాడు. ఇంతలో ఫోన్ మోగింది. ఎవరో ఏమో కానీ, రాఘవ పెట్టిన కేకకి, ఒక్క ఉదుటున హాల్లోకి వచ్చి పడ్డాను.

'శైలజా! అభీ సీరియస్‌గా ఉన్నాట్ట కామినేనిలో జాయిన్ చేసార్ట! మనం వెళ్ళాలి!" చేతిలో రిసీవర్ పట్టుకునే వణుకుతున్న గొంతుతో అన్నాడు రాఘవ.

అభీ సీరియస్సా? అసలు ఫోన్ ఎవరు చేశారు? రిసీవర్ తీసుకుని హలో... హలో అన్నాను. అవతల పెట్టేసారు.

**ఆంధ్రభూమి స్వర్ణోత్సవ కథల పోటీల్లో ద్వితీయ బహుమతి రూ. 5,000/-గెల్చుకున్న రచన**

వాళ్ళ కాలేజ్ కరస్పాండెంట్! అభీ ఏవో మాత్రలు మింగేశాడట. రాఘవ చెబుతుంటే, నా కాళ్ళ కింద భూమి కంపించిపోయింది.

అప్పటికప్పుడు కారు మాట్లాడుకుని బయల్దేరారు. మా ఏకైక సంతానం అభి. హైదరాబాద్‌లో ఒక ప్రముఖ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. మేమున్నది వరంగల్‌లో!

దారంతా ఇద్దరం ప్రాణాలు ఉగ్గబట్టుకుని కూర్చున్నాం. మనసులో సుళ్ళు తిరుగుతున్న ఆలోచనలు, భయాలు. వాటిని వ్యక్తీకరిస్తే అవే ఎక్కడ నిజమైపోతాయో అని భయం!

మేము హాస్పిటల్ చేరుకునేసరికి, అప్పటికే విషయం తెలుసుకుని హాస్పిటల్‌ని చుట్టుముట్టేసిన మీడియా వాళ్ళు. రిపోర్టర్స్, ఫొటోగ్రాఫర్లు. వాళ్ళ మైకులు, కెమెరాలు, తప్పించుకుని అతికష్టంమీద లోపలికెళ్ళాం.

లోపల... ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో, బెడ్‌పైన ముక్కుకి, చేతులకి రకరకాల ట్యూబ్‌లతో, చావుతో ఒంటరి పోరాటం చేస్తున్న అభి!

కడుపు లోపలినుండి తెరలుతెరలుగా తన్నుకొస్తున్న దుఃఖం! దానిని మించిన అపరాధ భావం!

"మమ్మీ, నాకు ఐ.ఐ.టి టెస్ట్‌లో ఇరవై రెండు మార్కులే వచ్చాయి! డాడీ ఏమంటారో..."

"మమ్మీ, నిన్న జ్వరం వచ్చింది. అయినా కూడా, మా వార్డెన్ ఏం చేశాడు తెలుసా! ఫైవ్‌థర్టీకే లేపి, ఒక మాత్ర ఇచ్చి ఆరింటికి క్లాస్‌కి పంపించాడు."

"ఊరూర్కే చిన్న చిన్న దగ్గులకీ, జ్వరాలకీ పరిగెడుతుంటే, వాడికి ఇంటి వైపే గాలి మళ్ళుతుంది. హాస్టల్ వాళ్ళే అవన్నీ చూసుకుంటారు..." అంటున్న రాఘవ.

"మమ్మీ నన్ను థర్డ్ బ్యాచ్‌లో వేసేశారు. ప్రశాంత్ వాళ్ళు సెకండ్ బ్యాచ్‌లోనే ఉన్నారు మమ్మీ! డాడీతో చెప్పకు ప్లీజ్!"

"మమ్మీ ఇలాగే కంటిన్యూ అయితే క్యాంపస్ కూడా మార్చేస్తారట! డాడీ ఏమంటారో..."

"నేనెంత చదువుదామనుకున్నా, ఎందుకో నావల్ల కావట్లేదు మమ్మీ. నేనస్సలు కాన్‌సెంట్రేట్ చేయలేకపోతున్నాను..."

ఫోన్ చేసిన ప్రతీసారి, అప్పుడప్పుడూ కలిసినప్పుడు, అభి పడ్డ ఆవేదన అంతా నా మస్తిష్కంలో రింగుమంటోంది.

తప్పదు... బయట ఎంత కాంపిటీషన్ ఉంది. ఒక కాలేజ్‌కి ఒక సెక్షన్‌లో కాంపిటీషన్‌కే తట్టుకోలేకపోతే, రేపు స్టేట్ మొత్తం ఇండియా మొత్తంతో కాంపీట్ చేయాలి. అప్పుడేం చేస్తాడు... కష్టపడాలి... రాఘవ వాదన.

ఎంతకని కష్టపడతారు... ఎంతకని తట్టుకుంటారు... ప్రతి క్షణం పోటీ... ప్రతి క్షణం... ఒత్తిడి... డెయిలీ టెస్ట్, వీక్లీ టెస్ట్, ఐఐటి టెస్ట్, ఎఐట్రిపుల్‌ఈ టెస్ట్, ఎంసెట్ టెస్ట్...

మార్కు తగ్గితే, ర్యాంకు తగ్గిపోతుంది. ర్యాంకు తగ్గితే, బ్యాచ్ మారిపోతుంది. టాప్ బ్యాచ్ నించి కిందకి. ...ఇంకా కిందకి. ఇంకా తగ్గితే క్యాంపస్ మారిపోతుంది.

అవును. కాలేజ్ వాళ్ళకి కావాల్సింది, టాప్ ర్యాంకుల, బంగారు గుడ్లు పెట్టే బాతులు! పొద్దున అయిదింటి నుంచి రాత్రి పదకొండు వరకు, తలెత్తకుండా చదివే మిషన్లు. పిల్లల మానసిక స్థితితో వారికేం పని? అసలు తల్లిదండ్రులకే లేని పట్టింపు వాళ్ళకెందుకు? అసలు ఈ వ్యవస్థనంతా సృష్టించినదెవరు? ఆలోచిస్తుంటే తల తిరిగిపోతోంది.

పిల్లల ఆసక్తి ఏమిటో, వారి సామర్థ్యం ఎంతో చూడకుండా, గొర్రెల మందలా, ప్రవాహంలోపడి కొట్టుకుపోతూ, అత్యాశకుపోయే తల్లిదండ్రులు, వాళ్ళ ఆశలను సొమ్ము చేసుకుంటూ విద్యను వ్యాపారం చేసిన కార్పొరేట్ సంస్థలు, మనందరం కాదా! ఈ పోటీ ప్రపంచంలో, ఆ పసివాళ్ళ హృదయ వేదన వినేదెవ్వరు? ఆ ఆక్రందనను అర్థం చేసుకునేదెవరు?

కళ్ళనిండా ధారాపాతంగా కారుతున్న కన్నీరు... మమ్మల్ని క్షమించు కన్నా... దయచేసి, మాకు ఇంకొక్క అవకాశం ఇవ్వు ప్లీజ్... మనసులోనే వేయి దేవుళ్ళకు మొక్కుకుంటున్నా.

మర్నాడు పొద్దునకల్లా, ఇదొక పెద్ద సంచలన వార్త అయిపోయింది. పేపర్లనిండా, టి.వి. ఛానల్స్ నిండా ఇదే న్యూస్. "పరీక్షల ఒత్తిడి తట్టుకోలేక ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం". టి.వి. తెరల నిండా, అద్దాల వెనుక ఐసియూలో ఉన్న అభి ముఖం! కాలేజ్ ముందు ధర్నాకి దిగిన విద్యార్థి సంఘాలు. వాళ్ళలో కొంతమంది ప్రిన్సిపాల్ రూమ్‌లో ఫర్నిచర్ అంతా ధ్వంసం చేసారట. ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ పారిపోయారట.

న్యూస్ ఛానల్స్‌లో చర్చలు! మానవ హక్కుల సంఘం వాళ్ళు, విద్యార్థి సంఘం నాయకులు, రాజకీయ నాయకులు, అంతా చేరి విద్యావ్యవస్థలో లోపాలు, పెరిగిపోతున్న వ్యాపార ధోరణి, పిల్లలపై ఒత్తిడి ఒకటేమిటి రకరకాల చర్చలు చేశారు. ఒకరినొకరు విమర్శించుకున్నారు దూషించుకున్నారు.

"మా వాడు చాలా బ్రిలియంట్ అండీ. టెన్త్‌క్లాస్‌లో 96%. వాడెందుకు ఇలాంటి పని చేస్తాడు? ఎవరు ఇచ్చారో ఏమో! అసలు కాలేజ్ మీద వాళ్ళ ఎంక్వయిరీ వెయ్యాలి..." మీడియా ముందు రాఘవ! అసలు ఎలా జరిగిందన్నది పక్కనపెడితే, ఎందుకు జరిగిందన్న కఠిన వాస్తవాన్ని కళ్ళతో చూడలేని తండ్రి! తప్పు ఇంకెవరిదో, ఎవరో పన్నిన కుట్ర అంటూ ఇంకా మనసుని మభ్యపెట్టుకునే ప్రయత్నం.

అదృష్టవశాత్తు, గండం గడిచింది. అభి బయటపడ్డాడు. స్పెషల్ రూమ్‌లోకి మార్చారు. మీడియా వాళ్ళకి వేరేదో బ్రేకింగ్ న్యూస్ దొరికింది. ఇంక ఇటువైపు రాలేదు.

ప్రాణాలైతే దక్కాయి కానీ, అభి కళ్ళలో ఏదో భీతి! వలలో పట్టుపడ్డ జంతువులాగా, మాటలో చేతలో ఏదో రెస్ట్ లెస్ నెస్!

జీవితంలో మొట్టమొదటిసారిగా, రాఘవకి ఎదురు తిరిగాను. ఎప్పట్నించో, ఎన్నాళ్ళుగానో, నాలో దాచుకున్న భావాలన్నీ వెళ్ళగక్కాను. "నా బిడ్డ మామూలు స్థితికి రాకపోతే, నిన్ను వదలను..." హిస్టీరిక్‌గా అరిచాను. నా మాటలకో, అభి పరిస్థితి చూసో, రాఘవ వెనక్కి తగ్గాడు. మొదటిసారిగా, నా సలహా అతడు విన్నాడు. నన్ను పట్టుకుని, "మీ ఇద్దరికోసం కాకపోతే, నేను బతికేది ఎందుకే"... అంటూ కన్నీరు కార్చాడు.

(మిగతా 27వ పేజీలో)


**పరిచయం**



**పేరు:** సింగరాజు రమాదేవి


**ఊరు:** వరంగల్


**వృత్తి:** ఎల్ఐసి ఆఫ్ ఇండియాలో

**అభిరుచులు:** మంచి సాహిత్యం, సంగీతం, సినిమాలు, తిలక్, చాసో, శ్రీపాద కథలంటే అమిత ఇష్టం.

**రచనలు:** వివిధ పత్రికల్లో కథలు, కవితలు, వ్యాసాలు వ్రాసాను. అయితే నా తొలి కథ ప్రచురించి ప్రోత్సహించింది ఆంధ్రభూమి పత్రికే!

**రచయిత్రి చిరునామా:**
**ఎస్.రమాదేవి,**
**ఫ్లాట్ నెం: ఎఫ్-4, ప్రగతి ఎన్‌క్లేవ్,**
**కాళోజీ స్ట్రీట్, నక్కలగుట్ట,**
**హన్మకొండ, వరంగల్- 506001.**

(18వ పేజీ తరువాయి)

తరవాతి మూణ్ణెళ్ళు ఇద్దరం అహర్నిశలు అభిని కంటికి రెప్పలా కాపాడాం. మందులు, కౌన్సిలింగ్, సైకో థెరపీ, అన్నింటినీ మించి 'చదువు', 'పోటీ'అనే మాట ఎత్తకుండా, బేషరతుగా మేము పంచిన ప్రేమాభిమానాలతో వాడు మెల్లమెల్లగా కోలుకున్నాడు.

ఇంట్లోనే ఉండి ఇంటర్ పరీక్షలు రాశాడు. అరవై శాతం మార్కులతో పాసయ్యాడు. ఒక వారం తర్వాత.

"డాడీ! నేను డిగ్రీలో ఆర్ట్స్ తీసుకుంటాను" అభి మెల్లగా చెప్పాడు. ఈమధ్య వాడు ఇదివరకటిలా ప్రతిదానికీ నన్ను తడికలా వాడుకోవట్లేదు. మమ్మీ ప్లీజ్! డాడీతో నువ్వు చెప్పు. నువ్వు చెప్పు! అని నా వెనక దాక్కోవట్లేదు. దానికి కారణం, ఇదివరకూ పులి, మేకలా ఉండే వారి బంధం, ఇప్పుడు కాస్త మారటం కావచ్చు. మా భార్యాభర్తల మధ్య కూడా పెరిగిన అవగాహన అనురాగాలతో, ఆహ్లాదమైన ఇంటి వాతావరణం కావచ్చు.

కాకపోతే వాడు చెప్పిన దానికి నేను ఆశ్చర్యపోయాను. వాడి బుర్రలో ఏమి తిరుగుతుందో రాఘవ అయితే నిర్ఘాంతపోయాడు.

"ఆర్ట్స్ తీసుకుంటావా? ఎందుకూ...?"

నా వంక కాస్త అనుమానంగా చూశాడు. నేను చదివింది ఎమ్.ఎ. (లిటరేచర్) మరి.

'అదికాదురా. నువ్వు ఐఐటి, ఎఐట్రిపుల్ఈ అవేం రాయొద్దు. ఒక్క ఎంసెట్ మాత్రం అటెంప్ట్ చెయ్యి. నేనేదో తంటాలుపడి మేనేజ్‌మెంట్ కోటాలో నీకు సీటు ఇప్పిస్తాను." రాఘవ చెప్పాడు.

"వద్దు డాడీ! నేను సైన్స్ చదవలేను ఇంక. నాకు ఇంట్రెస్ట్ లేదు." స్థిరంగా చెప్పాడు అభి. నిస్సహాయంగా చూశాడు రాఘవ. అయితే, మా ఒప్పందం ప్రకారం, వాడికి నచ్చిన గ్రూప్‌లోనే చేర్చాం.

చరిత్ర, రాజనీతి శాస్త్రం, ఆర్థిక శాస్త్రం విషయాలుగా అభి బి.ఎ.లో చేరాడు. తొమ్మిదినుండి మూడుదాకా కాలేజీ. అటుపై ఒక గంట సైకాలజిస్టు సలహామేరకు, రిలాక్సేషన్‌కోసం స్విమ్మింగ్. ఆపై కాసేపు రెస్ట్, ఒక గంట చదువు. అభి జీవితం, మళ్ళీ ఒక గాడిలో పడింది.


అదృష్టవశాత్తు, అభి కాలేజి లెక్చరర్లు చాలా అనుభవజ్ఞులు. స్వతహాగా తెలివిగలవాడైన అభి, సబ్జెక్ట్‌పై ఆసక్తి కూడా చూపటంతో, వాడిని బాగా ప్రోత్సహించారు. రకరకాల రిఫరెన్స్ బుక్స్ అవీ ఇచ్చి, వాడి ఆసక్తిని ఇంకా పెంచారు.

ముఖ్యంగా, హిస్టరీ లెక్చరర్ చైతన్యప్రసాద్, అభికి మంచి మార్గదర్శకుడయ్యాడు. కళ్ళజోడు, గడ్డం, విజ్ఞానం నింపుకున్న కళ్ళు, చిన్న పిల్లలతో పిల్లాడిలా కలిసిపోయి, చరిత్రలాంటి డ్రై సబ్జెక్ట్, నేటి పరిస్థితులకి జోడించి, చక్కటి ఉపమానాలతో, ఆసక్తికరంగా మలిచే ఆయనకు అభి బాగా దగ్గరయ్యాడు.

ఆయన ఇచ్చిన అసైన్‌మెంట్స్ పూర్తిచేసేందుకై, గంటలు గంటలు లైబ్రరీలో గడిపేవాడు. ఒకరోజు లైబ్రరీనుంచి షేక్స్‌పియర్ కామెడీస్ తెచ్చి చదువుతున్నాడు.

"ఈ ఇంట్రెస్ట్ ఎప్పట్నించి రా?" ఆశ్చర్యంగా అడిగాను.

"సార్ చెప్పారు మమ్మీ. సబ్జెక్ట్ పుస్తకాలే కాదు. అన్ని రకాలు చదవాలి. ముఖ్యంగా క్లాసిక్స్ అన్నారు. అసలు సర్ సబ్జెక్ట్ హిస్టరీ కానీ ఆయన షేక్స్‌పియర్ నించీ విక్రమ్‌సేథ్ దాకా అందరినీ కోట్ చేస్తారు తెలుసా..." అభి చెప్పాడు.



అసలు మన కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, కార్లు ఇవన్నీ వేస్ట్ మమ్మీ, ఇదా అభివృద్ధి అంటే... అక్కడ చేయటానికి పనిలేక, తినటానికి తిండి లేక ఎంత కష్టపడుతున్నారు తెలుసా... కాలేజ్‌లోని ఎన్.ఎస్.ఎస్. బృందంతో కలిసి కుగ్రామాలకి వెళ్ళొచ్చిన అభి ఆవేశం...

"అలాగా, అయితే దానికి లైబ్రరీ దాకా ఎందుకూ, మనింట్లోనే ఉన్నాయి" ఉత్సాహంగా చెప్పాను. దాచేసిన నా పుస్తకాల కలెక్షన్ అంతా అభికి చూపించాను. షేక్స్‌పియర్ మొదలుకొని సిడ్నీ షెల్డన్ దాకా, చలం, శ్రీశ్రీ నించి యండమూరి దాకా... ఇంకా నాన్‌ఫిక్షన్ వగైరా అన్నీ...

వావ్! మనింట్లో ఇన్ని పుస్తకాలు ఉన్నాయా? వాడి కళ్ళల్లో ఆశ్చర్యం. నాకు మళ్ళీ నా కాలేజీ రోజులు గుర్తొచ్చాయి. నిజంగా సాహితీ ప్రపంచంలో పరిచయం, ఒక అద్భుతమైన అనుభవం. దానిని అభితో పంచుకోవటం, నాలో ఒక కొత్త ఉత్సాహాన్ని నింపింది.

రోజూ రాత్రి డైనింగ్ టేబిల్ దగ్గర మామధ్య ఎన్నో చర్చలు జరిగేవి.

అసలు చాసో ఇంత అద్భుతంగా ఎలా రాస్తాడు మమ్మీ అని ఓరోజు.

మమ్మీ చూస్తే ఇరానియన్ ఫిల్మ్స్ చూడాలి. సార్ ఇవాళ ఫిల్మ్ క్లబ్‌కి తీసుకెళ్ళారు... మరో రోజు.

అసలు మన కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, కార్లు ఇవన్నీ వేస్ట్ మమ్మీ, ఇదా అభివృద్ధి అంటే... అక్కడ చేయటానికి పనిలేక, తినటానికి తిండి లేక ఎంత కష్టపడుతున్నారు తెలుసా... కాలేజ్‌లోని ఎన్.ఎస్.ఎస్. బృందంతో కలిసి కుగ్రామాలకి వెళ్ళొచ్చిన అభి ఆవేశం...

మొదట్లో మా చర్చలలో అంతగా ఆసక్తి చూపని రాఘవ కూడా ఇప్పుడు ఉత్సాహంగా పాలుపంచుకుంటున్నాడు.

ఈ పుట్టిన రోజుకి, నేను ఓల్డేజ్‌హోమ్‌కి విరాళం ఇవ్వాలనుకుంటున్నాను శైలూ... రాఘవ చెబుతుంటే నాకు ఆనందం వేసింది.

రిలాక్సేషన్‌కోసం మొదలుపెట్టిన స్విమ్మింగ్‌లో అభి మంచి ప్రతిభ కనపరిచాడు. వాళ్ళ కోచ్ వాడిని జిల్లా స్థాయి పోటీలకి సెలక్ట్ చేశాడు. అక్కడ ఫస్ట్ వచ్చాడు. తర్వాత జాతీయ స్థాయికి కూడా ఎంపికయ్యాడు.

మనవాడు స్విమ్మింగ్ ఛాంపియన్ అవుతాడేమో... రాఘవ కళ్ళలో మెరుపు. నేను నవ్వాను.

మొత్తానికి సమయం గడిచేకొద్దీ, అభికి విజ్ఞానదాహం పెరిగింది. వాడి ఆలోచనా పరిధి పెరిగింది. వాడి మాటల్లో లోతు, వాడి వాదనల్లో పరిపక్వత!

వాడితో సమానంగా చర్చించేందుకు, నేనూ రాఘవ, న్యూస్ పేపర్లు, చదివి, ఇంటర్‌నెట్ బ్రౌజ్ చేసి, మా జ్ఞానం పెంచుకుంటున్నాం.

ఇదిగో నిన్న అభి చెప్పాడే, ఆ న్యూస్ మీద అనాలిసిస్ అంటూ రాఘవ నాకు పేపర్ చూపించేవాడు.

అభి వాళ్ళ లెక్చరర్ చెప్పారుట. న్యూయార్క్‌లోని పెద్ద యూనివర్సిటీ! దానికోసం స్కాలర్‌షిప్‌కి ట్రై చెయ్యమన్నారట...ప్రస్తుతం అభి లక్ష్యమదే...

"ఏంటి! మమ్మీ, మాకు మాత్రం పెట్టి, నువ్వు తినలేదు? నీకు నేను గారెలు వేసి పెడతా ఆగు!" నన్ను కుదిపి చెప్తున్న అభి మాటలకి, ఆలోచనల్లోంచి బయట పడ్డాను.

చెమర్చిన కళ్ళతో వాడిని దగ్గరికి తీసుకున్నాను. అభి రేపు స్విమ్మింగ్ ఛాంపియన్ కాకపోవచ్చు. డాక్టరు, ఇంజనీరు అస్సలు అవ్వడు. కానీ, దేశ, సామాజిక, ఆర్థిక విషయాలపై అవగాహన కలిగి, మంచి సాహిత్యాభిలాష కలిగి, ఇతరుల సమస్యలకి స్పందించే గుణం కల బాధ్యతగల పౌరుడిగా ఎదుగుతున్నాడు.

అది చాలదా మనిషికి... ... ★

